విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 31, ఆగస్టు 2023

విద్యార్థులను మోసం చేసిన జగన్‌ను గద్దెదింపుదాం

- విద్యకు పెద్దపీట వేస్తామని నట్టేట ముంచారు..
- ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకుడు పి.నారాయణస్వామి

మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు

విశాలాంధ్ర - జెఎన్టియుఏ : విద్యార్థులను మోసం చేసిన జగన్మోహన్ రెడ్డి ను గద్దె దింపేందుకు సిద్ధం కావాలి అని ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు పి. నారాయణస్వామి పేర్కొన్నారు. బుధవారం నీలం రాజశేఖర్ రెడ్డి భవనం లో ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు ఎస్. రమణయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు పి నారాయణస్వామి మాట్లాడుతూ.. సిపిఐ రాష్ట్రవ్యాప్తంగా దేశాన్ని కాపాడండి రాష్ట్రాన్ని రక్షించండి అనే నినాదంతో జరుగుతున్న బస్సు యాత్ర అనంతపురం నగరంలో నాలుగో తేదీ సాయంత్రం జరిగే భారీ బహిరంగ సభకు విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చే పది సంవత్సరాలు గడిచిన ప్రతి సంవత్సరం రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తానన్న నరేంద్ర మోడీ విద్యార్థులను యువకులను నట్టేట ముంచి మోసం చేశారని మండిపడ్డారు.. ఏపీకి ప్రత్యేక హోదా విభజన హామీలు అమలు చేయడంలో బిజెపి ప్రభుత్వం పూర్తిగా నాశనం చేసిందని అన్నారు.రాష్ట్రంలో జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యకు పెద్దపీట వేస్తానని అనేక హామీలు ఆర్బటాలు పలికి, తీరా అధికారంలోకి వచ్చాక విద్యార్థులను నట్టేట ముంచారని మండిపడ్డారు.. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులు ఉండలేని పరిస్థితి ఈ రాష్ట్రంలో ఉందన్నారు.. ధరలేమో ఆకాశాన్ని అంటాయి గాని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు మాత్రం మెస్ కాస్మోటిక్ ఛార్జీలు పెంచలేదని పేర్కొన్నారు.. రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ కళాశాలలో డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న బోధన బోధనేతర పోస్టులు భర్తీ చేయాలన్నారు.. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు.. పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77ను రద్దు చేయాలని తెలిపారు. వైద్య విద్యార్థులకు విద్యను దూరం చేసే విధంగా తీసుకువచ్చిన జీవో నెంబర్ 107 108 నీ తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అవలంబిస్తున్న విద్యావ్యతిరేక విధానాల పైన విద్యార్థులు పోరాటాలకు సిద్ధం అవ్వాలని విద్యార్థి నాయకులకు పిలుపునిచ్చారు..ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి, జిల్లా ఆఫీస్ బేరర్స్ ఆనంద్ కుమార్, వెంకట్ నాయక్, ఆంజనేయులు, నరసింహ యాదవ్, వంశీ కృష్ణ, సాయి స్వరూప జిల్లా కార్యవర్గ సభ్యులు వినోద్ కుమార్ చందు, హరికృష్ణ గణేష్ విశ్వనాథ్, అభి, లెనిన్ హరుణ్ రషీద్ పాల్గొన్నారు.

వెలిగొండ రహదారి పనుల పరిశీలన

విశాలాంధ్ర–ఉరవకొండ: ఉరవకొండ నుంచి వెలిగొండకు వెళ్లే రహదారి పనులను బుధవారం మండల వైస్ ఎంపీపీ నరసింహులు, మాజీ జెడ్పిటిసి సభ్యులు తిప్పయ్య, వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు ఆంజనేయులు పరిశీలించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ నరసింహులు మాట్లాడుతూ ఉరవకొండ నుంచి వెలుగొండ కు వెళ్లే రహదారి గత అనేక సంవత్సరాలుగా మరమ్మత్తులు లేక శిథిలావస్థకు చేరుకోవడం జరిగిందని దీనివల్ల ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారడంతో ఈ విషయాన్ని తాము మాజీ ఎమ్మెల్యే వై విశ్వేశ్వర రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి రోడ్డు నిర్మాణానికి గాను గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ. 1.85 కోట్ల రూపాయలను మంజూరు చేయించడం జరిగిందన్నారు.

పనులు పరిశీలిస్తున్న నాయకులు

రోడ్డు నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని కాంట్రాక్టులుకు కూడా సూచించడం జరిగిందన్నారు త్వరలోనే ఈ పనులన్నింటినీ పూర్తిచేసి వెలుగొండ గ్రామ ప్రజలకు ఇబ్బందులను తొలగిస్తున్నట్లు ఆయన తెలిపారు.

సీఎంకు కృతజ్ఞతలు : ఎమ్మెల్సీ శివారామిరెడ్డి

తల్లి ఆశీర్వాదం తీసుకుంటున్న తనయులు

విశాలాంధ్ర–ఉరవకొండ: ఎల్లారెడ్డిగారి భీమ రెడ్డి కుమారులైన తమ ఐదు గురు సోదరులకు ప్రజాసేవ చేయడానికి అవకాశం కల్పించిన ముఖ్య మంత్రి జగన్మోహన రెడ్డికి ఎల్లప్పుడూ కృతజ్ఞులై ఉంటామని ఎమ్మెల్సీ వై శివరామిరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ సోదరుల్లో గుంతకల్లు ఎమ్మెల్యేగా వై.వెంకట్రామి రెడ్డి, ఆదోని ఎమ్మెల్యేగా వై.సాయి ప్రసాద్ రెడ్డి, మంత్రాలయం ఎమ్మెల్యేగా వై బాలనాగి రెడ్డి, ఉమ్మడి అనంతపురం జిల్లా శాసనమండలి సభ్యునిగా వై శివరామి రెడ్డి అయిన తాను కొనసాగుతున్నామని ఇప్పుడు తమ సోదరులలో పెద్దవాడైన సీతారామ రెడ్డికి కూడా తి. తి.దే. పాలకమండలి సభ్యునిగా ప్రజాసేవ చేయడానికి అవకాశం ఇచ్చారని గుర్తు చేశారు. ఇంతటి ప్రేమను తమ కుటుంబం పట్ల చూపుతున్న ముఖ్యమంత్రి యొక్క అడుగుజాడల్లో నడుస్తూ ప్రజలకు మరింత చేరువై ప్రజాసేవలో మమేకమైతామని తెలియజేశారు.

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి పరిటాల

విశాలాంధ్ర–రాప్తాడు: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా ఉమ్మడి ఏపీ రాజకీయాలలో మరిచిపోని నాయకుడు పరిటాల రవీంద్ర అని టీడీపీ మండల కన్వీనర్ పంపు కొండప్ప, ప్రధాన కార్యదర్శి దగ్గుబాటి శీనా తెలిపారు. రాప్తాడు టీడీపీ కార్యాలయంలో బుధవారం పరిటాల రవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ పరిటాల పేరును ఓ బ్రాండ్ గా మార్చేసిన ఘనత రవిదేనన్నారు. అన్ని వర్గాలపై భారం మోపుతున్న సీఎం జగన్ ను ఇంటికి సాగనంపుదామన్నారు. ప్రతీ కార్యకర్త రాబోయే రోజుల్లో పరిటాల రవీంద్ర ఆశయ సాధనకు, టిడిపి అధికారంలోకి వచ్చే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచులు ఉజ్జినప్ప, సాకే తిరుపాలు, నాయకులు గంగలకుంట రమణ, కిష్ట, మరూరు గోపాల్, ఇంద్ర, బోగినేపల్లి రమేష్, మూలింటి బీరన్న, రామనేపల్లి శీనా, గవ్వల మహేష్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వార్డు సమస్యలపై పర్యటించిన కమిషనర్

విశాలాంధ్ర–గుంతకల్లు : పట్టణంలోని 37 వార్డులో బుధవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున వార్డు సమస్యలపై పర్యటించారు. ఈ సందర్భంగా డ్రైనేజీలు పరిశీలిస్తూ శానిటేషన్ అధికారులకు తక్షణం సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. వార్డులోని వివిధ సమస్యలపై మున్సిపాలిటీ సిబ్బందితో ఆయన వార్డు సమస్యల పరిష్కారం దిశగా పనిచేయాలని ఆదేశించారు.

క్రీడలు విజయ చిహ్నాలు..

విశాలాంధ్ర- జేఎన్టీయూఏ: క్రీడలు విజయ చిహ్నాలు అని ఉపకులపతి ఆచార్య జింక రంగ జనార్ధన్, రిజిస్ట్రార్ ఆచార్య సి. శశిధర్ పేర్కొన్నారు. బుధవారం స్పోర్ట్స్ డే, ప్రపంచ పారిశ్రామికవేత్తల దినోత్సవాన్ని పురస్కరించుకొని విశ్వవిద్యాలయం ప్రధాన గేటు వద్ద నుండి ర్యాలీ ప్రారంభమై సప్తగిరి వరకు వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపక బృందం చేపట్టారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు బి.దుర్గ ప్రసాద్, సుమలత, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ అరుణ క్రాంతి, పిఆర్ ఓ రామ శేఖర్ రెడ్డి, అధ్యాపకు బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలపై పెన్నా సిమెంట్ కార్మికుల నిరసన

విశాలాంధ్ర–యాడికి: యాడికి మండల పరిధిలోని బోయరెడ్డిపల్లి గ్రామము వద్ద గల పెన్నా సిమెంట్ ఫ్యాక్టరీ నందు పనిచేస్తున్న కాంట్రాక్ట్ వర్కర్స్ తమకు రావలసిన జీతాలు బోనస్ గురించి ఫ్యాక్టరీ వద్ద నిరసన చేస్తుండగా ఎస్సై గురు ప్రసాద్ రెడ్డి వారి సిబ్బందితో ఫ్యాక్టరీ వద్దకు వెళ్లి కాంట్రాక్ట్ వర్కర్స్ తో మరియు మేనేజ్మెంట్ వారితో మాట్లాడి వారి సమస్యను పరిష్కరించి నిరసనను విరమింప చేశాడు.

స్ఫూర్తి ప్రదాత పల్లె ఉమాకు ఘన నివాళి

- ఎందరో పేద విద్యార్థులకు ఉచితంగా విద్యనందించిన గొప్ప మనిషి .. ప్రముఖుల నివాళి

విశాలాంధ్ర -జేఎన్టీయుఏ: విద్య ప్రదాత, పేదల పెన్నిధి, సామాజిక , రాజకీయ, సేవ స్ఫూర్తి ప్రదాత, అమృత మూర్తి మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి సతీమణి పల్లె ఉమా ఐదవ వర్ధంతి వేడుకలు పల్లె వ్యవసాయ క్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం అనంతపురంలోని పల్లె ఉమా ఘాట్ వద్ద మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, తనయుడు, శ్రీ బాలాజీ విద్యా సంస్థల చైర్మన్ పల్లె కిషోర్, కోడలు పల్లె సింధూర,యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి, కేరళ మాజీ డీ జీ పీ శంకర్ రెడ్డి, కుటుంబ సభ్యులు, పలువురు ప్రముఖులతో పాటు వేలాది మంది పల్లె ఉమాకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పల్లె రఘునాథ రెడ్డి మాట్లాడుతూ.. పల్లె ఉమా తన జీవితంలోకి రావటం తన అదృష్టమని, తన విజయం వెనక పల్లె ఉమా ఉందని, తను భౌతికంగా లేనప్పటికీ తనలో ఉందని, ఆమె అనంతపురం జిల్లాలో ఎంతోమంది పేద విద్యార్థులకు నిస్వార్థంగా ఎటువంటి ఫీజు తీసుకోకుండా తన విద్యా సంస్థలలో విద్యనందించిన ఘనత ఆమెకు దక్కుతుందన్నారు. కార్యక్రమానికి మాజీ ఎంఎల్ఏలు ప్రభాకర్ చౌదరి, హనుమంత రాయ చౌదరి, ఈరన్న,సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్, టీడీపీ ఎస్సి సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎంఎస్ రాజు, రాష్ట్ర కార్యదర్శి గడ్డం సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు ఎల్ నారాయణ చౌదరి, అంబిక లక్ష్మి నారాయణ, గాండ్ల విశాలాక్షి, ఉన్నం మారుతి చౌదరి, సాకే గంపన్న, మాజీ జెడ్ పీ టీ సి వేణు గోపాల్, సీపీఐ నాయకులు వేమయ్య యాదవ్, ఎస్ కే యూ ఉప కులపతి ప్రొ.మాచి రెడ్డి రామకృష్ణా రెడ్డి, విశ్రాంత ఆచార్యులు కృష్ణారెడ్డి, తదితరల ప్రముఖులు నివాళులు అర్పించారు. శ్రీ బాలాజీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో పీవీకేకేఐటీ, శ్రీ కృష్ణ దేవరాయ వ్యవసాయ మరియు ఉద్యాన కళాశాలలు, డిగ్రీ, పీజీ అన్ని కళాశాలల్లో జిల్లా వ్యాప్తంగా ఆసుపత్రు లలో బ్రెడ్లు, పండ్లు, అన్నదానం, రక్తదానం, వృద్ధాశ్రమాల్లో నిత్యావసర సరుకుల పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీవీకేకే ఐటీ డీన్ డా.వై.సంతోష్ కుమార్‌రెడ్డి, బాలాజీ ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాళ్ళు డా.సుబ్బారావు, డా.మన్మ దేశ్వరరెడ్డి, పీజీ కళాశాల ప్రిన్సిపల్ డా.ముని కృష్ణారెడ్డి, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ వీర ప్రకాష్, బీఈడీ కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్ రెడ్డి, ఏవో ధనుష్, బాలాజీ విద్యా సంస్థల ప్రిన్సిపాళ్ళు, అధ్యాపకులు, విద్యార్థులు హాజరై నివాళులు అర్పించారు.

డాక్యుమెంట్ల రూపకల్పన కొత్త విధానంపై సర్వత్రా నిరసన

- కదం తొక్కిన డాక్యుమెంట్ రైటర్లు .. పెన్‌డౌన్

విశాలాంధ్ర–ఉరవకొండ: ప్రజల ఆస్తులకు సంబంధించి యాజమాన్య హక్కు పత్రాలైన డాక్యుమెంట్లు రూపకల్పన విధానాన్ని ఆన్లైన్లో ప్రభుత్వం తీసుకురావ డాన్ని నిరసిస్తూ బుధవారం ఉరవకొండలో స్థానిక రిజిస్టర్ కార్యాలయం ముందు డాక్యుమెంట్ రైటర్లు, వెండర్లు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డాక్యుమెంట్ రైటర్ల యూనియన్ సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విధానానికి నిరసనగా రెండు రోజులపాటు తాము పెన్డౌన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆన్లైన్ లోనే డాక్యుమెంట్ను తయారు చేసుకుని చలానా చెల్లించి టైం స్లాబ్ ఏర్పాటు చేసుకుని రిజిస్ట్రేషన్ కార్యాలయంలోనూ గ్రామ, వార్డు సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకునే విధానాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. దీనివల్ల సేల్ డీడ్స్ లో లోపాలు తలెత్తితే ఆస్తులు కలిగిన వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని పేర్కొన్నారు. ఆన్‌లైన్ డాక్యుమెంట్ విధానం వల్ల మోసాలు జరిగే అవకా శాలు ఎక్కువ ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా నూతన విధానాన్ని ఉపసంహరించుకోవాలన్నారు.

స్టాంప్ వెండర్లు, లేఖరుల పొట్టకొడుతున్న ప్రభుత్వం

విశాలాంధ్ర–తాడిపత్రి: పట్టణంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం ముందు బుధవారము దస్తావేజు లేఖర్లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ శాఖ రూపొందించిన ప్రైమ్ కార్డ్ 2.0 పై దస్తావేజు లేఖరులు, స్టాంప్ వెండర్లు పొట్టకొట్టే విధంగా ఈ నిర్ణయం ఉందని ప్రభుత్వం ఈ విధానాన్ని తక్షణం రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆ వృత్తినే జీవనాధారంగా నెట్టుకొస్తున్న వేలాది మంది దస్తావేజు లేఖరులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మా వినతిని మన్నించి తమ జీవనాధారమైన స్టాంప్ రైటింగ్ కు అనుమతి నివ్వాలని కోరుతున్నామని తెలిపారు. ఈ కార్య క్రమంలో స్టాంపు రైటర్లు సయ్యద్ వలి భాష, కొండయ్య, చందు, అశోక్ పాల్గొన్నారు.

ఎంపీఆర్ డ్యామ్ గేట్ల మరమ్మతులు చేయించాలి...

జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి

విశాలాంధ్ర–అనంతపురం వైద్యం: ఎంపీఆర్ డ్యామ్ గేట్ల మరమ్మతులు చేయించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. బుధవారం గార్లదిన్నె మండలంలోని ఎంపీఆర్ (మిడ్ పెన్నార్ రిజర్వాయర్) డ్యాంను జిల్లా కలెక్టర్ పరిశీలన చేశారు. డ్యాంలో ప్రస్తుతం ఎంత నీరు నిల్వ ఉంది, ఈ సీజన్లో ఎంత నీరు వచ్చే అవకాశం ఉంది, ఆయకట్టు ఎంత ఉంది, తదితర వివరాలను జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎంపీఆర్ డ్యాం నుంచి ఎలాంటి లీకేజీలు జరగకుండా చూడాలన్నారు. ఈ సంవత్సరం డ్యాం కింద నీటి సరఫరా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, హెచ్.ఎల్.సి ఈఈ వెంకటరమణారెడ్డి, జెఈ సురేంద్ర రెడ్డి, తహసిల్దార్ ఉషారాణి, సర్పంచులు ఉష, ఐచ్చలన్న, తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ సమీక్ష సమావేశంలో గుంతకల్లు టిడిపి నాయకులు...

విశాలాంధ్ర–గుంతకల్లు : విజయవాడ మంగళగిరిలో బుధువారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమీక్షా సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వెంకట శివుడు యాదవ్ ,తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కేసీ హరి,గుంతకల్ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్ , అనంతపూర్ పార్లమెంట్ రైతు సంఘం అధ్యక్షుడు లక్ష్మి రెడ్డి,పామిడి మండల కన్వీనర్ ముసలి రెడ్డి , అనంతపూర్ పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి బిఎస్ శ్రీధర్, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీటెక్‌తో పాటు హానర్స్ డిగ్రీ పట్టా..

విశాలాంధ్ర - జేఎన్టీయూఏ: బీటెక్ తో పాటు హానర్స్ డిగ్రీ పట్టా ఉండేందుకు చదవే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు ఉపకులపతి ఆచార్య జింక రంగా జనార్ధన్, రెక్టర్ ఆచార్య విజయ్ కుమార్,రిజిస్ట్రార్ ఆచార్య సి. శశిధర్ పేర్కొన్నారు. బుధవారం మెకానికల్ విభాగంతో బీటెక్ సిలబస్ మార్పులు, ఆర్ 23 రెగ్యులేషన్స్ అంశాలపై అనుబంధ కళాశాల ప్రిన్సిపల్ తో సమీక్షించారు. రెగ్యులర్ డిగ్రీ తో పాటు హానర్స్ డిగ్రీ పొందాలంటే అదనంగా 15 క్రెడిట్ లను సాధించాలని తెలిపారు. ఈ సిలబస్‌లో 05 ప్రొఫెషనల్ ఎలక్టివ్స్ ను, 04 ఓపన్‌ఎలాక్టివ్స్, మరియు 05 స్కిల్ ఓరిఎంటెడ్ కోర్సులను ప్రవేశపెడు తున్నామని, క్రెడిట్ ట్రాన్స్ పర పాలసీని ప్రవేశపెడుతున్నామని, రెండు సమ్మర్ ఇంటర్న్షిప్ లను రెండవ సంవత్సరం, మూడవ సంవత్సరం చివరిలో చేయాలని, వీటికి ఎనిమిది వారాల వ్యవధిని ఇస్తామని తెలిపారు. నాలుగవ సంవత్సరం రెండవ సెమిస్టర్ ప్రాజెక్టు లేదా ఇంటర్న్షిప్‌ను సెమిస్టర్ మొత్తం ప్రవేశ పెడుతున్నామని తెలిపారు. వీటితో పాటు ఆడిట్ కోర్సులను కంప్లీట్ చెయ్యాలని తెలిపారు. హానర్స్ డిగ్రీ కోసం రిజిస్టర్ చేసుకోవడానికి రెగ్యులర్ డిగ్రీలో మూడవ సెమిస్టర్ వరకు 7 సిజిపి ఏ సాధించిన విద్యార్థులు అర్హత సాధిస్తారని తెలిపారు. డిగ్రీలో మల్టీ పుల్ ఎగ్జిట్ విధానాన్ని ప్రవేశ పెడుతున్నామని తెలిపారు. రెక్టార్ ఆచార్య యం.విజయ కుమార్ పాల్గొన్నారు.

సింగనమలకు చేరిన సీపీఎం జీపుజాత

- ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం ఇవ్వాలి

విశాలాంధ్ర–శింగనమల: ఎండిపోతున్న పంటలకు ఎకరానికి 50 వేల రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని సిపిఎం పార్టీ చేపట్టిన జీపు జాత బుధవారం సింగనమల మండల కేంద్రానికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బాల రంగయ్య, ఓ నల్లప్ప, మండల కార్యదర్శి భాస్కర్ లు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో తీవ్ర వర్షాభావం వలన ఖరీఫ్లో సాగు చేసినపంటలుఎండిపోతున్నాయని. వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ ఇవ్వాలని. ధరల పెరుగుదల నిరుద్యోగ సమస్యలపై. ఆగస్టు 30 నుండి సెప్టెంబర్ 4 వరకు జరిగే సిపిఎం సమరభేరి.పంటల ఎండిపోతున్న పంటలను పరిశీలన చేస్తూ తీవ్ర వర్షా బావం నెలకొందన్నారు. జీపుజాత.కల్లుమడి తరిమెల, నిదనవాడ, ఆనందరావుపేట,రాచేపల్లి, సలకం చెరువు,సోదన పల్లి,పోతురాజు కాలువ మీదగా నార్పల మండలానికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జయరాముడు, శ్రీనివాసులు, ఆంజనేయులు. లక్ష్మీనారాయణ, వెంకట నారాయణ, నాగభూషణ, రాజు, కుళ్లాయప్ప, నాగేంద్ర, పుల్లన్న, భాస్కర, లక్ష్మీనారాయణ, వెంకట,గంప మల్లయ్య.కేశన్న ,మునెప్ప శంకర. తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం

విశాలాంధ్ర–రాప్తాడు: విద్యార్థులు పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల రక్తహీనత తగ్గుతుందని పీహెచ్సీ సీహెచ్ఓ శివప్రసాద్ తెలిపారు. స్థానిక ఏపీ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ పద్మజాదేవి ఆధ్వర్యంలో బుధవారం 10-19 వయసు ఉన్న దాదాపు 280మంది ఆడపిల్లలకు హిమోగ్లోబిన్ పరీక్ష, బరువు, ఎత్తును పరిశీలించారు. రక్తహీనత వున్న వారిని గుర్తించి అవగాహన కల్పించారు. పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు, అదేవిధంగా ప్రతి గురువారం ఇచ్చే ఐరన్ టాబ్లెట్ తప్పక వాడాలన్నారు. మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ లక్ష్మి, ఏఎన్ఎంలు శ్రీదేవి, లీలావతి, ఎంపీహెచ్ఏలు నారాయణస్వామి, కంబగిరిస్వామి, ఆశా కార్యకర్తలు అరుణ, సువర్ణ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం

ఎస్పీ చేతుల మీదుగా రూ.75 వేల చెక్కులు అందజేత

విశాలాంధ్ర–అనంతపురం వైద్యం: బ్రహ్మసముద్రం కానిస్టేబుల్ ఉమేష్ (పి.సి నంబర్ 3059) ఇటీవల మృతి చెందారు. ఈయన కుటుంబానికి విడో, ఫ్లాగ్ ఫండ్ కింద రూ. 75 వేల విలువ చేసే చెక్కులు ఉమేష్ భార్య వనితకు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు బుధవారం అందజేశారు. చెక్కులు అందజేత కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు జిల్లా పోలీసు పరిపాలనాధికారి శంకర్ ఉన్నారు.

లీకైన పైపులైనుకు మరమ్మత్తులు చేయండి

విశాలాంధ్ర -తాడిపత్రి: పెద్దపప్పూరు మండలం పసులూరు గ్రామం దళితవాడలో లీకైన త్రాగునీటి పైపులైను మరమ్మత్తులు చేయాలని ఆ కాలనీ ప్రజలు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. దాదాపు పది రోజుల నుండి తాగునీటి పైపు లైను లీకై నీరంతా వృధా అవ తోంది. అంతేకాకుండా ఆ ప్రాంతంలో ఇదేవిధంగా నీరు నిల్వ ఉంటే దోమలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉందన్నారు. సచివాలయ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఒకరిపై ఒకరు సమస్యను నెట్టు వేసుకుంటున్నారు తప్ప ఎలాంటి చర్యలు చేపట్టలేదని కాలనీ ప్రజలు వాపో తున్నారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిన పరిశీలించి లీకేజీ తాగునీటి పైపు లైను మరమ్మత్తులు చేసి ఆ ప్రాంతంలో నీరు నిల్వ ఉండకుండా ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు చేపట్టాలని కోరారు.

ప్రవేట్ ఆసుపత్రిని తనిఖీ చేసిన జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి

విశాలాంధ్ర–అనంతపురం వైద్యం: అనంతపుం పట్టణం లోని చంద్ర సూపర్ స్పెషలిటీ ఆసుపత్రి ని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. ఈ బి దేవి బుధవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ప్రభుత్వ నిబంధన ప్రకారం ఆంధ్ర ప్రదేశ్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్, (ఏపీఎంసి ఈ యాక్ట్) మరియు స్కానింగ్ కు సంబంధించి ప్రి కాన్సెప్షన్ ప్రినేటల్ డైయాగ్నోస్టిక్స్ టెక్నిక్స్. (పిసి పి అండ్ టీ యాక్ట్) నిబంధనల ప్రకారం ఆసుపత్రిలో ధరల పట్టికను, రిజిస్ట్రేషన్ వాలిడిటీ. డాక్టర్ స్ హర్హతలు, మొదలగు వాటిని పరిశీలించడం జరిగింది. ఆసుపత్రి తనిఖీలో డిప్యూటీ డెమో త్యాగరాజ్, డిప్యూటీ హెచ్.ఈ.ఓ. గంగాధం పాల్గొన్నారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 31, ఆగస్టు 2023

పేదల గుండెల్లో గూడుకట్టుకున్న మహనీయుడు పరిటాల

టిడిపి నాయకులు ఘన నివాళి

విశాలాంధ్ర-ధర్మవరం: పేదల గుండెల్లో గూడు కట్టుకున్న మహనీయుడు పరిటాల రవీంద్ర అని టిడిపి నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పరిటాల రవీంద్ర 66వ జయంతి వేడుకలను తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించుకున్నారు. పార్టీ కార్యాలయంలో పరిటాల రవీంద్ర చిత్రపటానికి పూలబాలలతో ఘనంగా నివాళులు అర్పిస్తూ వారు పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం తెలుగుదేశం పార్టీ నాయకులు కమతం కాటమయ్య, పురుషోత్తం గౌడ్, చింతపులుసు పెద్దన్న, భీమనేని ప్రసాద్ నాయుడు, పరిసే సుధాకర్ మాట్లాడుతూ పరిటాల రవీంద్ర ఒక వ్యక్తి కాదని, ఒక శక్తి అని, ఆయన బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని తెలిపారు. రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ పాలనలో ఉన్న అరాచక శక్తులను పీచ మనిషి ప్రత్యర్థులకు సింహ స్వప్నముల మారాడని తెలిపారు. జిల్లాలో పార్టీ కోసం తన ప్రాణాన్ని సైతం లెక్కచేయక పార్టీ కార్యకర్తల కోసం తన ప్రాణాన్ని సైతం తృణపాయంగా అర్పించిన మహెూన్నత వ్యక్తి పరిటాల రవీంద్ర అని వారు తెలిపారు. పరిటాల రవీంద్ర పార్టీ కోసం చేసిన సేవలు వెలకట్టలేనివని వారు తెలిపారు. వారి అడుగుజాడల్లో ప్రతి నాయకుడు కార్యకర్త నడుస్తూ ముందుకు వెళ్లాలని తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి పక్కనగల పాత అన్న క్యాంటీన్ వద్ద పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అద్ర మహేష్ కృష్ణాపురం జమీర్ అహ్మద్, మారుతి స్వామి, అంబటి సనత్, ఉస్మాన్, సాహెబ్బి, మున్ని, సిపిఎం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగను రైతులు కాపాడుకోవాలి..

▸ జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: జిల్లాలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సాగుచేసిన వేరుశనగను రైతులు కాపాడుకోవాలని కలెక్టర్ ఎం.గౌతమి పేర్కొన్నారు. బుధవారం జిల్లాలోని కూడేరు మండలంలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. ముద్దలాపురం గ్రామం వద్ద రైతు నగేష్ పొలంలో సాగుచేసిన బ్యాడిగ చిల్లీ పంటలో ఈ క్రాప్ బుకింగ్ ప్రక్రియను పరిశీలించారు. రైతు వివరాలు, పంట నమోదు తదితర వివరాలు సక్రమంగా అప్లోడ్ చేశారా లేదా అనేది ఆరా తీశారు. ఈ క్రాప్ బుకింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నిరంతరంగా రైతులకు విద్యుత్ సరఫరా చేయిస్తామన్నారు. అనంతరం అనంతపురం నగరానికి తాగునీటిని సరఫరా చేసే డా.వైఎస్ రాజశేఖర్ రెడ్డి అనంతపురం మంచినీటి అభివృద్ధి పథకాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి నగరానికి ప్రతిరోజు 43 ఎంఎల్డి నీరు వెళు తోందని, ఎలాంటి ఇబ్బంది లేకుండా నీటి సరఫరా చేయాలని ఆదేశించారు. అక్కడ నిర్మాణంలో ఉన్న 16 ఎంఎల్డి కెపాసిటీ కలిగిన ఫిల్టర్ హౌస్ నిర్మాణాన్ని రెండు నెలల్లో పూర్తి చేయాలని సూచించారు. ఆ తరువాత కూడేరు మండలంలోని జల్లిపల్లి గ్రామ పరిధిలో కౌలు రైతు మణెమ్మకు చెందిన ఐదు ఎకరాల పొలంలో కంది పంటకు ట్రాక్టర్ల ద్వారా నీటి సరఫరా విధానాన్ని తనిఖీ చేశారు. ఇలాంటి పద్ధతిని ప్రోత్సహించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఊహించినంతగా వర్షపాతం నమోదు కాలేదన్నారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్లో 3.70 లక్షల హెక్టార్లలో పంటల సాగు జరగాల్సివుండగా, దాదాపు 2.40 లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యాయన్నారు. అందులో పంటల సాగైన ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని, అందుకే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకోసం విత్తనాలు ఇచ్చేందుకు ఎలాంటి అవకాశాలు ఉన్నాయనేది పరిశీలించడం జరుగుతోందన్నారు. చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని, కొర్ర, రాగి, తదితర పంటల విత్తనాలను సిద్ధంగా ఉంచామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, ఏఎఫ్ ఏకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి, అగ్రికల్చర్ జెడి ఉమామహేశ్వరమ్మ, హార్టికల్చర్ డిడీ రఘునాథరెడ్డి, ఏపీఎంఐపి పీడి ఫిరోజ్ ఖాన్, రైతు నేస్తం ఫుడ్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ సీఈఓ మురళీకృష్ణ, ఎంపీపీ నారాయణరెడ్డి, తహసిల్దార్ శేషారెడ్డి, ఇక్రిశాట్ ప్రతినిధి రత్నేష్ జైస్వాల్, రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త సహదేవరెడ్డి, పబ్లిక్ హెల్త్ ఈఈ శ్రీనాథ్ రెడ్డి, మున్సిపల్ డిఈ చంద్రశేఖర్, ఏఈ సుబ్బరామయ్య, మంచినీటి అభివృద్ధి పథకం ఇన్చార్జి రాజశేఖర్ రెడ్డి, ఏడిఏ రవి, ఏఈ విజయకుమార్ పాల్గొన్నారు.

శుద్ధ జలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర-కూడేరు: ముద్దలాపురం సమీపంలో ఉన్న అనంతపురానికి త్రాగునీటి శుద్ధి జలాన్ని సరఫరా చేసే రక్షిత మంచినీటి పథకాన్ని బుధవారం కలెక్టర్ గౌతమి పరిశీలించారు. ఫిల్టర్ బెడ్లు ఎప్పటికప్పుడు మార్చాలని సంబంధిత అధికారులకు తెలియజేశారు. నీటి నిల్వపై ఆరా తీశారు. పక్కనే ఉన్న ఆర్డీటీ ఎకాలజీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ను పరిశీలించారు కార్యక్రమంలో ఆర్డిటి ఎకాలజీ డైరెక్టర్ మల్లారెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పరిటాల రవీంద్ర జయంతి

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ మాజీ శాసనసభ్యులు పరిటాల రవీంద్ర అణగారిన వర్గాలకు న్యాయం చేసేందుకు పోరాడినయోధుడు, ప్రజల మధ్య లేకున్నా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన పరిటాల రవీంద్ర జయంతినీ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత ఆధ్వర్యంలో బుధవారం తెదేపా కార్యాలయం నందు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి కేక్ కోసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వంకలో అక్రమ నిర్మాణాలను తొలగించండి

విశాలాంధ్ర-సోమందేపల్లి: మండల కేంద్రంలోని శిరిడి నగర్ లో ప్రభుత్వ స్థలంలో గల వంకను ఆక్రమించుకొని చేపడుతున్న అక్రమ నిర్మాణాలను తొలగించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని శిరిడీనగర్‌వాసులు బుధవారం తాహసిల్దార్ సురేష్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. సర్వే నెంబర్ 763-1(డి) లో గల భూమిలో సుమారు 40 కుటుంబాలు ఇళ్లు నిర్మించుకొని నివాసమున్నామని అయితే సర్వేనెంబర్ 763-1(ఈ), 761, 762,763లలో గల ఆముదాల కుంట వంకను కొందరు వ్యక్తులు ఆక్రమించుకున్నారని, దీంతో శిరిడీనగర్ నుండి బయటకు వెళ్లే వర్షపు నీరు ముంచెత్తి కాలనీ నీటినిర్బంధంలో ఉండిపోవాల్సి వస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు నారాయణప్ప, శ్రీనివాసులు, అనిత, పవిత్ర, లక్ష్మీదేవి, రవి, ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

మహాశక్తితో మహిళలకు వరాలు....

విశాలాంధ్ర-చిలమత్తూరు: శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు తెలుగు మహిళా ఆధ్వర్యంలో చిలమత్తూరు మండలం శెట్టిపల్లి కోడూరు పంచాయతీలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ మహాశక్తి పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో మినీ మేనిఫెస్టోలో పొందుపరిచిన మహా శక్తి ద్వారా ప్రతి మహిళా జీవితంలో వెలుగులు నింపవచ్చున్నారు. కార్యక్రమంలో తెలుగు మహిళ పార్లమెంటు ఉపాధ్యక్షురాలు శ్రీదేవి, మండలం తెలుగు మహిళా అధ్యక్షురాలు లక్ష్మీదేవి, పార్లమెంట్ కార్యదర్శి గాడ్రాళ్లపల్లి లక్ష్మీదేవి, శెట్టిపల్లి యూనిట్ ఇంచార్జ్ మల్లీ రెడ్డి, విజి మాజీ ఎంపీటీసీ సూర్యనారాయణ పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

విశాలాంధ్ర-చిలమత్తూరు: మండల పరిధిలోని కోడూ రు జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగరాజు(45) మృతి చెందాడు. కోడూరు తోపు జాతీయ రహదారిపై ఆగి లారీని పెనుగొండ వైపు నుండి బాగేపల్లి వైపుకు ద్విచక్ర వాహనంలో వెళ్తున్న నాగరాజు ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో తల ఒకచోట మొండెం మరో చోట పడిన దృశ్యాలు పలువురిని కలిచివేశాయి. మృతుడు పెనుగొండ తాలూకా ముష్టికోవెల గ్రామానికి చెందిన నాగరాజుగా గుర్తించారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని ఘనంగా నిర్వహిస్తాం

విశాలాంధ్ర-ధర్మవరం: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను సెప్టెంబర్ 2వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నట్లు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలక మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. స్వగృహంలో బుధవారం విలేకరులతో పలు విషయాలను వెల్లడించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పార్టీ నిర్దేశించిన కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తామని, జనసేన పార్టీ జిల్లా కమిటీ సభ్యులకు, మండల అధ్యక్షులు, వీర మహిళలకు, ముఖ్య నాయకులకు, కార్యకర్తలకు సమాచారం అందించామన్నారు. భవన నిర్మాణ కార్మికులతో సహ భక్తి భోజనాలు, పారిశుద్ధ్య కార్మికుల కాలనీలను సందర్శించి, పుట్టినరోజు వేడుకలను జరుపుకొనుట, రక్తదాన శిబిరాలను నిర్వహించుట, బడుగు బలహీన వర్గాల విద్యార్థుల వసతి గృహాలను సందర్శించి, పుస్తకాలు, పెన్నులు అవసరమైన వస్తువులను పంపిణీ చేయుట, దివ్యాంగులకు అవసరమైన వస్తువుల వితరణ కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని వారు తెలిపారు.

భరోసాగా జీవించండి...

● పోలీస్‌శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది..

● ఎస్పీ కె.శ్రీనివాసరావు

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: రోడ్డు ప్రమాదాలు, అనారోగ్యం, తదితర కారణాలతో జిల్లాలో మృతి చెందిన పోలీసు అధికారులు మరియు సిబ్బంది కుటుంబాలతో ఎస్పీ బుధవారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో సమావేశమయ్యారు. క్షేమ సమాచారాలు, సాధకబాధకాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుండీ అందాల్సిన ప్రయోజనాలపై సమీక్ష చేశారు. జిల్లాలో కొందరు పోలీసు అధికారులు, సిబ్బంది వివిధ కారణాలతో చనిపోవడం బాధకల్గించిందని, ఆ కుటుంబీకులకు అండగా ఉండటమే కాకుండా జాప్యం లేకుండా ప్రయోజనాలు అందజేస్తున్నాం అని పేర్కొన్నారు.

కారుణ్య నియమకాల విషయంలో కూడా నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబాలకు ఆ నష్టాన్ని పూడ్చకపోవచ్చు కానీ ఇబ్బందులు, సమస్యలు ఉంటే తప్పకుండా పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మీరు ఎప్పుడూ పోలీసు కుటుంబమే అనే ధీమాగా ఉండాలని, అందుకు అనుగుణంగా పోలీసుశాఖ సేవలు అందిస్తుందన్నారు.

అనంతరం దివంగత సి.ఐ ఆనందరావు కుటుంబ సభ్యులకు మరియు ఏ.ఆర్ కానిస్టేబుల్ భాస్కర్ రెడ్డి కుటుంబ సభ్యులకు చెరో రూ. ఒక లక్ష ప్రకారం రూ.2 లక్షల విలువ చేసే చెక్కులను ఎస్పీ అందజేశారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఆర్ విజయభాస్కర్ రెడ్డి, ఏ.ఆర్ డీఎస్పీ మునిరాజ్, ఆర్ ఐ రాముడు, జిల్లా పోలీసు కార్యాలయం పరిపాలనాధికారి శంకర్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, సుధాకర్ రెడ్డి, తేజ్ పాల్ మరియు జిల్లా పోలీసు కార్యాలయం సూపరింటెండెంట్లు శ్రీనివాసులు, సావిత్రమ్మ పాల్గొన్నారు.

పల్లె ఉమా సేవలు చిరస్మరణీయం

▸ ఘనంగా ఐదవ వర్ధంతి వేడుకలు..

▸ ప్రిన్సిపాల్ ముసలి రెడ్డి

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణములోని సాయి నగర్ లో గల శ్రీనివాస జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల, పిజి కళాశాల నందు శ్రీ బాలాజీ విద్య సంస్థల మాజీ చైర్మన్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి సతీమణి పల్లె ఉమా ఐదవ వర్ధంతి వేడుకలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు,విద్యార్థులు, పల్లె ఉమా చిత్రపటానికి పూలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సంతాప సభలో పల్లె ఉమా చేసిన సేవ కార్యక్రమాలను వారు వివరించారు. అనంతరం పల్లె ఉమా కు ఆత్మ శాంతి కలగాలని కోరుతూ, ఐదు నిమిషాలు మౌనం పాటించారు. తదనంతరం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గల రోగులకు పల్లె ఉమా జ్ఞాపకార్థం బ్రెడ్లను పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలల ప్రిన్సిపాల్లు ముసలి రెడ్డి, పుష్ప వాహన రెడ్డి, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంలో నివాళులర్పిస్తున్న దృశ్యం

పల్లె ఉమా వర్ధంతికి తరలివెళ్లిన నాయకులు..

విశాలాంధ్ర-కొత్తచెరువు: మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి సతీమణి పల్లె ఉమా ఐదవ వర్ధంతి వేడుకలకు మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు వాహనాల్లో తరలి వెళ్లారు. అనంతపురంలో హైవేలో ఉన్న ఎస్టేట్లో ఆమె సమాధికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పల్లె రఘునాథ్ రెడ్డిని పలకరించారు. ఆమె చేసిన సేవలు ఎంతోమంది విద్యార్థులకు స్ఫూర్తి స్థాయికంగా నిలిచిందన్నారు. ఆయనకు ఎంతో తోడ్పాటు అందించింది అన్నారు. ఆమె లేని లోటు తీరనిది అన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రామకృష్ణ, టౌన్ కన్వీనర్వ వి శ్రీనివాసులు, టిడిపి నాయకులు బోయరాజు, డిపో భాస్కర్, కిరణ్, వెంకటేశు, సుబ్రహ్మణ్యం, సురేష్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర-బుక్కపట్నం నుంచి.. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి సతీమణి స్వర్గీయ పల్లె ఉమా ఐదో వర్ధంతి సందర్భంగా మండల కేంద్రం నుంచి టిడిపి నాయకులు భారీ సంఖ్యలో అనంతపురం తరలివెళ్లి పల్లె ఉమా ఘాటు వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఉమా తమ విద్యాసంస్థల ద్వారా ఎందరో నిరుపేదలకు ఆర్థిక సహాయం చేసిన మహెూన్నత వ్యక్తిని తెలిపారు. తరలిన వారిలో సత్య సాయి జిల్లా కార్యదర్శి సామ ఆదినారాయణ, మండల కన్వీనర్ మల్ రెడ్డి, ఎస్సీసెల్ అధ్యక్షురాలు యశోద రాయుడు తెలుగు మహిళా అధ్యక్షురాలు లావణ్య గౌడ్, నాయకులు వెంకటరాముడు, సుబ్బారెడ్డి మీసాల మురళి, గంగాధర్ , సంజీవ రాయుడు, అబ్దుల్ వాజిద్, తెలుగు యువత నాయకులు సుధీర్, సతీష్ కుమార్, మంజు, భాస్కం ఉన్నారు.

ప్రారంభమైన పవిత్రోత్సవ, సుదర్శన హెూమం

..శ్రీ గణపతి సచ్చిదానంద జ్ఞాన బోధ సభా ట్రస్ట్ సభ్యులు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని కొత్తపేటలో గల శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ గణపతి సచ్చిదానంద జ్ఞాన బోధ సభ ట్రస్ట్ సభ్యులు ఆధ్వర్యంలో పవిత్రోత్సవ సుదర్శన హెూమం వేడుకలు బుధవారం ఘనంగా అర్చకులు, కమిటీ సభ్యుల, భక్తులు నడుమ అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత ప్రధానార్చకులు సుదర్శన చార్యులు, సునీల్ కుమార్ ఆచార్యులు శ్రీ వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలను ఉదయం నిర్వహించారు. అనంతరం సాయంత్రం కార్యక్రమంలో మొదటి రోజు భాగంగా అంకురార్పణ కార్యక్రమాన్ని వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు నడుమ అర్చకులు నిర్వహించారు. విశ్వ కేశన ఆరాధన, రక్ష చందనం, మృత్యోంగ్రహణం, వాస్తు హెూమం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ పవిత్రోత్సవ సుదర్శన హెూమముల వేడుకలు ఈనెల 30వ తేదీ నుండి సెప్టెంబర్ ఒకటవ తేదీ వరకు మూడు రోజులు పాటు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం లో మెటికల కుల్లయప్ప, బెస్త దత్త శివ, శంకర సంజీవులు, బేల్లే నాగప్ప, సాగా సురేష్, గుద్దిటి రామాంజనేయులు, రంగా శ్రీనివాసులు, వాలంటీర్లు, మహిళా మండలి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేంతవరకు పెన్‌డౌన్

● కార్డు ప్రైమ్ వల్ల వేలాది మంది రోడ్డుపాలవుతారు..

● దస్తావేజు లేఖరులు

విశాలాంధ్ర-ధర్మవరం: రాష్ట్రవ్యాప్తంగా దస్తావేజు లేఖరుల పెన్డౌన్లో ప్రారంభంగా ధర్మవరంలో కూడా బుధవారం తమ సమస్యల పరిష్కారం కొరకు నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ శాఖ నూతనంగా ప్రవేశ పెట్టబోతున్న కార్డ్ ప్రైమ్ 2.0 వలన వేలాదిమంది దస్తావేజు లేఖరులు, డిటిపి ఆపరేటర్లు, స్టాంపు వెండర్లు, వారి సహాయకులు జీవనోపాధిని కోల్పోయి, మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందని తెలిపారు. పెన్డౌన్ కార్యక్రమం ఈనెల 31వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్లకు ఎలాంటి సేవలు అందించబడవని అన్నారు.

దస్తావేజు లేఖర్లు, స్టాంపు వెండర్లు సమ్మె

విశాలాంధ్ర-పెనుకొండ: రాష్ట్ర ప్రభుత్వ ప్రవేశ పెట్టిన కార్ట్ 2.0 విధానం వలన ప్రజలకు ఏ మాత్రం ఉపయోగపడని మరియు ఒరిజినల్ దస్తావేజు లేకుండా కేవలం డిజిటల్ దస్తావేజును డౌన్‌లోడ్ చేసుకొని అదే ఒరిజినల్ దస్తావేజుగా చలామణి అయ్యేటట్లుగా నూతన కార్యక్రమం వల్ల దస్తావేజు వృత్తిదారులకు జరుగుబోవు అన్యాయాన్ని అడ్డుకునేందుకు పెనుకొండ సబ్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ రైటర్స్ అండ్ అసిస్టెంట్స్ సంఘం పెన్ డౌన్ కార్యక్రమం నిర్వహిచారు. డిమాండ్లపై సబ్ రిజిస్టర్ నల్లప్పకు కు లేఖను అందించారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు

విశాలాంధ్ర ధర్మవరం: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల లో సిల్క్ హబ్బు ఏర్పాటు చేయడం జరిగిందని, పీఎంకేవై ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సురేష్ బాబు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి షేక్ అబ్దుల్ ఖయ్యూం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ సెప్టెంబర్ ఒకటవ తేదీ నుండి డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన వారు అర్హులని తెలిపారు. యువతీ యువ కులు పేర్లను తమ కళాశాలలో నమోదు చేసుకోవాలని తెలిపారు. శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశం కూడా కల్పిస్తామని, వివరాలకు సెల్ నెంబర్ 9182288465 కు సంప్రదించవచ్చునని తెలిపారు.

విధుల నిర్లక్ష్యంలో ఎంపీడీవోపై విచారణ

విశాలాంధ్ర రొళ్ల : రొళ్ల మండల పరిషత్ అభివృద్ధి అధికారి కల్లుమడి ఆజాద్ పై ఓ ప్రజా ప్రతినిధి ఉన్నతాధికారులకు పిర్యాదు చేస్తూ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తాడని, విధి నిర్వహణలో మద్యం సేవించి విధులకు హాజవుతారని ఆరోపణలు చేసిన విషయం విధితమే. ఈ విషయం పట్ల జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు డివిజన్ అధికారి శివారెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో తో విచారణ చేసి అనంతరం ప్రజా ప్రతినిధులతో, కార్యాలయ సిబ్బందితో కూడా ప్రత్యేక విచారణ చేపట్టారు. ఈ నివేదికను జాయింట్ కలెక్టర్‌కి సమర్పిస్తానని డివిజనల్ అధికారి శివారెడ్డి తెలిపారు.

మార్కెటింగ్ సౌకర్యాలు అన్వేషించాలి

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: సెకండరీ ప్రాసెసింగ్ సెంటర్‌లో తయారు చేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాలు అన్వేషించాలని కలెక్టర్ ఎం.గౌతమి సూచించారు. బుధవారం కూడేరు మండలంలోని ముద్దలాపురం గ్రామం వద్దనున్న రైతు నేస్తం ఫుడ్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ను చేశారు. మిషనరీ, ఉత్పత్తుల వివరాలు, ఉత్పత్తులు ఎక్కడికి సరఫరా చేస్తారు, తదితర వివరాలను ఏఎఫ్ ఏకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి తెలియజేశారు. పప్పుధాన్యాలతో ఉత్పత్తులు తయారు చేయడం ఎంతో మంచి విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, అగ్రికల్చర్ జెడి ఉమామహేశ్వరమ్మ, హార్టికల్చర్ డిడీ రఘునాథరెడ్డి, ఏపీఎంఐపి పీడి ఫిరోజ్ ఖాన్, రైతు నేస్తం ఫుడ్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ సీఈఓ మురళీకృష్ణ, ఎంపీపీ నారాయణరెడ్డి, తహసిల్దార్ శేషారెడ్డి, ఇక్రిశాట్ ప్రతినిధి రత్నేష్ జైస్వాల్, ప్రధాన శాస్త్రవేత్త సహదేవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - హిందూపురం : పట్టణంలో ఏఐటీయూసీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి జిల్లా సీనియర్ నాయకుడు డి.దాదాపీర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఏఐటియుసి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కనిశెట్టిపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్ ఇంజనీరింగ్, పారిశుద్ధ్య కార్మికులను రెగ్యులర్ చేయాలని, ఇంజనీరింగ్ పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం 26,000 ఇవ్వాలని, ఇంజనీరింగ్ కార్మికులకు కూడా హెల్త్ అలవెన్స్ 6000 వెంటనే ఇవ్వాలని, చనిపోయిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఏఐటియుసి పట్టణ ఉపాధ్యక్షులు ఫక్రుద్దీన్, మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు వరదరాజులు, నరేష్, సుబ్రహ్మణ్యం, రాజు, ఉదయ్, గంగాధర, అదిల్, రంజనీ, పారిశుద్ధ్య విభాగపు గౌరవ సలహాదారు ముత్యాలప్ప, కోశాధికారి సురేష్, రాజు, ఉదయ్, గంగాధర, అదిల్, రంజనీ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

పౌర్ణమి గరుడసేవ సమాజ సంక్షేమం కొరకే..

- ఆలయ చైర్మన్ దాశెట్టి సుబ్రమణ్యాం

విశాలాంధ్ర-ధర్మవరం: ప్రతినెల నిర్వహించే పౌర్ణమి గరుడ సేవలో దాతల సహాయ సహకారంలోనే జరుగుతోందని, ఇటువంటి కార్యక్ర మాలు సమాజ శ్రేయస్సు కొరకే నిర్వహించడం జరుగు తోందని ఆలయ చైర్మన్ దాశెట్టి సుబ్రహ్మణ్యం, ఆలయ ఈవో వెంకటేశులు తెలిపారు. బుధవారం సాయంత్రం తిరుమల తిరుపతి పుణ్య క్షేత్రంలో జరిగే విధంగా సాంప్రదాయ పద్ధతిలో ధర్మవరం పట్టణంలో కూడా పౌర్ణమి గరుడ సేవను సాంప్రదాయ పద్ధతిలో, అర్చకులు కోనేరా చార్యులు, చక్రధర్ మకరంద బాబు, భాను ప్రకాష్ తోపాటు భక్తాదుల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారిని వివిధ రకాల పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరణ గావించారు. తదుపరి గరుడసేవ వాహనంలో శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ను గరుడసేవలో ఆసీనులు చేసి, ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు స్వామివారిని పట్టణ పురవీధులలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గరుడసేవ దాతలైన బోడగల నారాయణప్ప అండ్ సన్స్, బాలాజీ అండ్ బ్రదర్స్ వారి కుటుంబ సభ్యులను చైర్మన్ ఆహ్వానిస్తూ, అర్చకుల వేదమం త్రాల నడుమ అందరిని ఘనంగా సత్కరించారు. దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. అన్నమయ్య సేవా మండలి ద్వారా పొరాళ్ల పుల్లయ్య వారి శిష్య బృందం అన్నమయ్య సంకీర్తనలు భజనలు, గోదా రంగనాథ మహిళా మండలి కోలాటం భక్తాదులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కుండా చౌడయ్య , ఆలయ పాలక సభ్యులతోపాటు పొరాళ్ల పుల్లయ్య, పొరాళ్ల పద్మావతి, వారి శిష్య బృందం, భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.